మనికొళ్ళమాటా గొడ్డుకొక దెబ్బా అని. అన్ని . . . దెబ్బలుతిన్న బోడ్డి గాటికాడ మామూలుగానే బుసబుసలాడ్తా మేత తింటానే వుంది. సోబన్న మటుకు బువ్వ తినల్యాకపాయె! అట్టని ఎర్రన్నా, మారమ్మా కావాల్నని సోబన్నను తిట్టిందేమీ లేదు. వాళ్ళు మాటొర్సగా అన్నెట్టే వుండాది. పల్లో పొడంకాన్నుంచి గాటికాడ మేత తినడం దాంకా ఒక్కొక్క ఎద్దు ఒక్కొక్క రకంగా వుంటాది. బోడ్డి గాట్లో మేతను బుసపెడ్తా కుమ్ముతా తింటే, దాన్పతడి ముంగారు కొమ్ముల్ది రోన్ని పోసల్ను అందుకోని కండ్లు మూసుకోని నములుకుంటా కుద్దుగా తింటాది. బోడ్డి పాతాగా కొనదార్ది, దాన్తోపట్టె నిమ్మలమయింది.

దాంట్లతో సేద్యం సేస్తా వుండేటోనికి యియి తెల్సుతాయి. ఎద్దుతో కల్సి తనూ యింగో ఎద్దయి పన్జేసినోనికే, యెద్దెట్టాటిదో తెల్సేది. అట్టాటోనికి ఎద్దు సంగతి తెల్సినట్టే, ఎద్దుగ్గూడా అట్టాటోని సంగతి తెల్సిపోతాది. గోడ పొట్నుంచి రిక్క గొట్నా తన సేద్యకాడేనా, కాదా అనేది కనిపెట్తాది. నాగల్లో కూచ్చోని వుండే మనిసి పగ్గం బట్టిన తీరును బట్టే అసలోడా, కొత్తోడా అని కనుక్కొంటాది. సెయిమీన అట్ట సెయ్యేస్తే, అది తన కిట్టంగా వుండాదో కట్టంగా వుండాదో తోకాడిచ్చడంతోనే సెప్తాది.!

పుట్టగోసి సెట్టిన కాన్నుంచి ఎద్దుల మీదనే పన్జేస్తా వుండేదాన, ఏ ఎద్దెట్టాటిదో, దాని సని నాటమేందో, యీసేలో యీ యీరముట్టు యెంత తెగాల్నో సోబన్నకు బాగా తెల్సు. యీ పొద్దు ఎర్రన్న సేసినట్టు ఎన్నడూ లేన్ది ఎక్కిరిచ్చినట్టుగా సేద్యాని కొస్తే ... యీమయితాది? యీపొద్దు జరిగినట్టే జరుగుతాది. ఆ కట్టకాడి సేలో గొర్లు వుడిగిందాన తుమ్మ పీకెలు మొల్సి, గుంటకెనుముందుకు పోనీకుండా వుండాయి. వాట్ని కొట్టేందుకు కూలోన్నాడమంటే ... రొండ్రోజుల్నుంచి వూకొట్తానే వుండె. యీ పొద్దు, పొద్దు రొండు బార్లెక్కినాంక సెట్టడ్లే బుజానేసుకోని సేకి రేట్టు తాక్కుంటా, ఎర్రన్నే నొచ్చినా దబ్బా... సేనికాడికి!

నొచ్చి, "నేను గుంటికె తోల్తాగానీ, నువు సెట్లు గొట్టుపో" అని సెట్టడ్ల సేతికిచ్చె. కూలోనికి మల్లా కూలియ్యడమెందుకు, సేద్యం జేయడం సెట్లు గొట్టడం రొండూ సోబన్నతోనే సేయిచ్చుకోవచ్చులే... అనుకున్నెట్టుండాది. అదెట్టన్నా ఆయెగానీ... అసలుకు ఆయప్ప సేద్యం నేర్సుకోకుండానే సాలిచ్చినోడు! ఏ బాండు కాయితంలో ఎంత అసలుందాదో, వడ్డీ ఎంతయిందో నిద్దట్లో లేపినా సెప్తాడు గానీ యీసేలో యీరముట్టు యెంత తెగాల్నో, యీడ ఎద్దుకు అలకనగా వుంటాదో, యీడ బలువయితాదో యియ్యేం తెలవు. ఆయప్ప గుంటికె దిండు మీదికెక్కి 'హి' అంటూనే, 'హో' అని, బోడ్డి కాడిమానుకేసి కొమ్ము టకామని కొట్టె.

అయిదారు పగ్గాల దూరంలో సెట్లు గొడ్తా,బోడ్డాని యెవారం మూస్తా వుండే సోబన్నకు నగొస్తావుంది. కట్టబోసినకాడ మిట్టమంచొచ్చి మన్ను అని, మెత్తంగా వుండి, యీరముట్టు కనపన్నట్టు దిగిపోతాది. ఆడ గూడా ఆయప్ప గుంటికె దిక్కుండా తోల్నాడు! "యీ డెవుర్రా, యెదాముడినాయాలు" అనుకుంటా వున్నెట్టు బోడ్డి బుసబుసలాడ్తా వుంది. ఆడ కాలాను కుంటా సేతి బరువున తోలమని సెప్తే... "నాకు తెల్సులే, నువు సెట్లు గొట్టు" అనె. రొండు మలుపులయితానే గుంటికె నిలిపి, ఎద్దులు నెమురేయాలన్జెప్పి, తలకాయ కింద టువాల సెట్టుకోని, ఎలకల సందుకోని గురకలు సెట్టె.

## సేనుగల్లోడు

"ఈ పొద్దుగానీ సేద్యం అయి పోకపోతే, రేపు మల్లా యిదే సేనికి రావాల" అని సెప్తే, "నాకు తెల్సులే" అనె మల్లా. ఎర్రన్న ఆయిగా నిద్దరబాయెగానీ, ఎద్దులు మాత్రం ఆయప్ప సేద్యానికి పాపం యింగా నెమురేయ్యల్యాకపాయె. యిట్టాటప్పుడు నిద్దర్లేసి మల్లా గుంటికెక్కబోతా, జంబంగా నీలుక్కోనిపోయి,బోడ్డాని ముకుతాడు ముడిని పైకి జరపబోయినాడు. 'దొరికి నాడ్రా...' అనుకునిందేమో అది. అదేసట్న వూంచి తగిలె[4]. ఆయప్ప సేలో ఎల్లెలికిలా పడిపాయె.

సవ్వోడు లేసి ఆమొయిన వూడిపోయే అడ్డ పంచ మట్టుకుంటా బోడ్డాని కొట్టబట్టెమాడూ... పొలకాల తెగిపోతే ములుగట్టె, ములుగట్టె యిరిగిపోతే మేడ్తోక తీసుకోని కొట్ట కొట్ట సేలో యీ రంగం తొక్కె.



యింగా వుడుకు తగ్గక, సేలో వుండల్యాక యింటి దావ సెట్టె. ఆయప్ప యిట్టొచ్చి, అట్టబోతే సోబన్నే మిగిల్న సెట్లు కొట్టి, కొదవ పడకుండా సేద్యం సేసి పొద్దు వాటారే తప్పటికి ఎద్దల్తో యింటికి జేరె.

అవతల జరిగిందేంది? తను ఎద్దుల్నట్టా గాటిపొట్న కట్టేసి, రొంత మేత ముందరేసి నీళ్ళు తాగి వచ్చేతలికి ఎర్రన్న మల్లా ఎర్రికోపంతో బోడ్డాన్ని కొట్టడానికి లగును కొన్నాడు . అది పాపం గాటి పొట్న అవల్లకు యీ వల్లకు ఎగిరిపడ్తా, జార్తా, ఉచ్చపోసుకుంటా ... "ఎట్ట కొడ్తా వుండాడో మూసినావా సోబన్నా!" అన్నెట్టు మూస్తా వుండాది. తనడ్డంపోయి "ఆయీన తగిల్తే సచ్చిపోతాది" అంటే, "సచ్చిపోతే దీన్నాయినట్టాటి దాన్ని తెచ్చుకుంటాగానీ, నువు పక్కకు లే" అని అర్సె. ఎర్రన్న సెండ్లాం మారమ్మ నొచ్చి "యింగ సాల్తి ... యింగ సాల్తి" అని మొగుని రెట్టె బట్టి గుంజతానే, సోబన్న దిక్కునోరగా జూస్తా "ఎద్దుబోతే యింగోట యితాది, సేద్యగాడు బోతే యింగోడయితాడు, మనిసి బోతే" అని దీర్గిచ్చె. మనిసి అంటే ఆమె మొగుడే!

బోడ్డి పొడ్సినందుకు ఆయప్పకు దెబ్బలేం తగల్లా. అయితే దెబ్బలోపల్తగిలింది. తనెద్దు సేద్యగాన్నే మన కుండా తనను పొడ్సడం ఆయప్పకు అవుమానంగా వుంది. ల్యాకపోతే దాన్ని అంత కసిగా కొట్టడు. మారమ్మగ్గూడా అట్టనే వుందేమో! ల్యాకపోతే "సేద్యగాడు బోతే యింగోడయితాడు" అని యెందుకంటాది? ముందుగా వాళ్ళు యెందుకంత కోపగిచ్చుకునిందీ సోబన్నకు తెలలా. ఆలోసన సేయగా సేయగా అర్తమయితాంది. యిన్నాళ్ళా సేలు తనయే, ఎద్దులు తనయే అనుకొంటా సేసినాడు. "రేయ్, సేలు నీయి కాదు, ఎద్దులు నీయి కాదొరేయ్" అని యిప్పుడు యిద్దరూ సెప్పి, ఎచ్చరిచ్చినారు.

సేలుండాయిగనక వాళ్ళకు ఎద్దులు గావాల, సేద్యగాడూ కావాల. అయితేనేం? "ఎద్దు బోతే యింగోటొస్తాది, సేద్యగాడు బోతే యింగోడొస్తాడు" తనకు ఎద్దు తెల్సు, దాన్తో పన్జేయడం తెల్సు, యీసేలో యీరముట్టుయెంత తెగాల్నో తెల్సు. ఎర్రన్నకు సేద్యం తెల్దు, యీసేలో యీవల్ల యెట్టుంటాదో తెల్దు. అయినా సరే ..."సేద్యగాడు బోతే యింగోడయి తాడు, ఎద్దుబోతే యింగోటే!" రొండూ ఒకటే. ఏందిది?

ఏందిది అంటే, ఎర్రన్నకు ఏం తెలకపోయినా సేనుండాది. అదుంటే, ఎద్దుంటాది, ఎద్దెనకాల ఎద్దాల పోయే సేద్యగాడూ వుంటాడు. అది ల్యాకపోతే ఎద్దూ ఒకటే, సేద్యకాడూ ఒకటే. అందుకే వాళ్ళు అట్ట నింది.

1. నెమ్మదిగా 2. ఎద్దులను హెచ్చరిస్తూ నోటితో చేసే ధ్వని 3. మొక్కలను కొట్టేసే పరికరం 4. గట్టిగా ఢీకొనె 5. నిరుమకొని వెల్లికిలా 6. ఆరంభించాడు 7. వేయి